


# పరదేశీ కథలు

## – చిట్టే సిద్ధ లలిత



- 123 –

# జన్మల బంధం

నూటా నలభై స్పీడులో రయ్యిన దూసుకెళుతోంది ఆడి కారు. చుట్టూ కనుచూపుమేర ఎడారి ఇసుక బంగారు రంగులో తళతళా మెరుస్తోంది. మధ్యలో వేసిన తారురోడ్డు  బంగారులోకానికి వేసిన బాటలా కనపడుతోంది.

కువైట్ పట్టణానికి దూరంగా సువిశాలంగా పరుచుకున్న ఇసుక దిబ్బలవైపు కారు పరిగెడుతోంది. వేగానికి, గాలికి

ఎడారిఇసుక తెరలుతెరలుగా పైకి లేస్తూ కారు చుట్టూ దట్టంగా కమ్ముకుంటోంది. అయినా ఏమాత్రం స్పీడు తగ్గడం లేదు ఫాతిమా.

కోపంతో ఎరుపెక్కిన మొహంతో అపుడపుడూ దవడ కండరం బిగుసుకునేలా పళ్ళు కొరుకుతూ ఎక్సలేటర్ ను బలంగా తొక్కుతూనే వుంది.

ఆ సమయంలో కదనరంగంలో గుఱ్రాన్ని అదిలించే రుద్రమదేవిలా కనపడుతోంది ఆమె. ఆమె మొహంలోని కోపం చూస్తే ఏదో జరిగిందని అర్థమవుతోంది. కానీ అదేంటో ఊహించలేకపోతోంది రజని. వెనుక సీట్లో చిన్నబిడ్డ అయేషాను ఒళ్ళో కూర్చోపెట్టుకుంది రజని.

సంవత్సరం వయసున్న అయేషా ఒకచోట కుదురుగా వుండదు. ఈ మధ్యే నడక నేర్చిన ఆ పాపాయి బుడిబుడి నడకలతో పరిగెడుతుంటే పట్టుకోలేక పాపాయి వెనక పరుగులు పెడుతోంది రజని.

అయినా పక్కనే వున్నా, కంటికి రెప్పలా చూస్తున్నాకూడా అప్పుడప్పుడూ పట్టుతప్పి కింద పడిపోతోంది అయేషా.

కార్పెట్ మీద పడటంతో పెద్ద దెబ్బలు తగలడంలేదు కానీ పాలమీగడ వర్ణంలోని పాపకు చిన్నదెబ్బ తగిలినా చర్మం ఎర్రగా కందిపోతోంది.

ఆ మధ్యాహ్నం మసిబూసి తిని అయేషాతో ఆడుకుంటూ సోఫాలో కూర్చుంది మేడం ఫాతిమా.

ఇంతలో ప్రశాంతతను భగ్నం చేస్తూ గణగణా శబ్దంతో ల్యాండ్ లైన్ మోగింది. కార్డ్ లెస్ ను తీసి ఆమె చేతికిచ్చింది రజని.

అవతలవాళ్ళు చెప్పింది వినగానే ఫాతిమా మొహం ఎరుపెక్కింది. కోపంతో పళ్ళు కొరుకుతూ "సురాసురా అయేషాను తీసుకుని కారులో కూర్చో" అంటూ కారును ఎడారికేసి ఉరికించడంతో భయపడిపోతోంది రజని.

జేవురించిన ఫాతిమా మొహం, కారు స్పీడును చూసి మనసు ఏదో కీడును శంకిస్తోంది.

ఏ విషయంలోనో మేడంకు తనమీద కోపమొచ్చిందేమో అనుకుంటోంది. నచ్చని పనులు చేస్తే కువైట్ వాళ్ళు ఏ మాత్రం ఉపేక్షించరు. తనను ఈ ఎడారిలో వదిలేసి పోదు కదా? భయపడింది రజని.

నిన్న అయేషా ఆడుకుంటూ కింద పడింది. తలకు బొప్పి కట్టింది. అదృష్టవశాత్తూ మేడం ఇంటికి వచ్చేసరికి అది తగ్గిపోయింది. ఆ సంగతి మేడంకు తెలిసిందా? అందుకే కోపంగా వుందా? మొన్న మేడం చెప్పులను తుడుస్తూ ఎలా వుంటాయో అని వేసుకుని కాసేపు అటు ఇటూ నడిచి చూసింది. ఆ చెప్పుల ధర తన రెండు నెలల జీతంతో సమానం.

ఈ విషయమేమైనా మేడంకు అర్థమయిందా? పోయిన వారం మేడం కొత్తగా తెచ్చిన ముఖమల్ గౌనును తొడుక్కుని అద్దంలో చూసుకుంది. ఆ గౌనుకు ఏమైనా మరకలు అంటుకున్నాయేమో.. దాన్ని ఫ్రాన్స్ నుండి తెప్పించింది ఆమె. మరి పాడయితే ఊరుకుంటుందా? అంతెందుకు టేబుల్ మీదున్న అత్తరు తీయని సువాసనలు వెదజల్లుతోంటే మేడం ఆఫీసుకు వెళ్ళాక వంటికి పూసుకుని తను ఆనందించలేదూ..

అది గ్రహించే ఇప్పుడు మండిపడుతోందా? ఏదైనా తప్పు చేస్తే కువైట్ సేట్లు ఎడారిలో వదిలిపెడతారంట. అక్కడ తిండినీళ్ళు లేక ఎండకు మాడి చచ్చిపోతే ఆ శవాన్ని రాబందులు పీక్కుని తింటాయిట. తప్పు చేసేవారికి కఠినమైన శిక్షలే విధిస్తారు ఇక్కడ.

తను కువైట్ వచ్చి ఆరునెలలు కూడా కాలేదు. ఇంట్లో ఎదిగిన చెల్లెళ్ళు ఇద్దరున్నారు. వారికి కట్నాలు ఇచ్చి బంగారం పెట్టి పెళ్ళిచెయ్యాలి.ఇక్కడ తనకేమైనా అయితే తననే నమ్ముకున్న వారి జీవితం ఏమవుతుంది?

పక్కింటి పనిమనిషి చెప్పిన ఒక సంగతి గుర్తొచ్చింది.

"వాళ్ళింట్లో శ్రీలంక వంటావిడ సేటు, సేటాని ఊరెళ్ళగానే బెడ్ రూములోకి వెళ్ళి సేటు బెడ్ మీద పడుకుని అబ్బ ఎంత హాయిగా వుందో అంటూ నిద్రపోయిందట. బెంగాలీ డ్రైవర్ చూసి సేటుకు చెప్పాడు. అంతే వెంటనే ఆ శ్రీలంక పనిమనిషిని కొట్టి, తిట్టి వద్దని చెప్పి శ్రీలంకకు పంపించేసారట."

ఇలాంటి విషయాలను కద్దామాలు చెప్పుకుని నవ్వుకుంటారు. ఇలా వుంటాయి కువైట్లో కద్దామాల కథలు.

పరిపరి విధాల ఆలోచిస్తోంది రజని.

ఎదురింట్లో దేవి అనే తెలుగావిడ పని చేస్తుంది. ఆమె ఇండియానుండి సీసానిండా ఆవకాయ పట్టుకొచ్చి ఇచ్చింది.

మేడం ఫాతిమా అది చూసి "ఇదేంటిది ఎర్రగా రక్తంలా వుంది. ఇదెలా తింటారు? ఇది ఇంట్లో వుండటానికి వీల్లేదు" అని భయంగా చూస్తూ సీసాను చెత్తలో పడేసింది.

ఆమె భయం చూసి నవ్వొచ్చింది రజనికి. మరోవైపు ఆవకాయ చెత్తలో పడేసినందుకు ప్రాణం వుసూరుమనింది.

కువైట్ వాళ్ళు కారం మసాలాలు అసలు తినరు. ఒక్కోసారి ఎయిర్ పోర్టులో కూడా ఈ పచ్చళ్ళు అనుమతించరు. తీసి డస్టబిన్ లో పడేస్తారు. అరబ్బీ వంటలు నాన్ వెజ్ తో కూడుకునివుంటాయి. రొట్టెలు, సూపులు, సలాడ్లతో వేరేగా వుంటాయి. కారం కలిపి మనం తినే ఆహారం వాళ్ళు తినలేరు.

మొదట్లో అరబ్బీ వంటలు సయించక ఇబ్బంది పడినా అలవాటయ్యాక ఇప్పుడు బానే వున్నాయి అనిపిస్తోంది రజనికి.

ఆరోగ్యానికి దోహదపడే మంచి ఆహారాన్ని తీసుకుంటారు కువైటీస్. మటన్, చికెన్, ఫిష్ తప్పనిసరిగా వుండాలి. వీటికి ముందు సలాడ్ లేకుండా వుండదు. ఉదయం సాయంత్రం రొట్టెలు తింటారు.మధ్యాహ్నం ఒక్కపూటే అన్నం తింటారు. తిన్నాక బ్లాక్ టీ తప్పకుండా తాగుతారు. అందులోనూ సంపన్నులు కావడంతో సమస్యలు తక్కువ. మంచి ఆహారం తీసుకుంటారు కాబట్టి చాలా ఆరోగ్యంగా, అందంగా వుంటారు అరబ్బులు. వాళ్ళ సౌందర్యాన్ని కళ్ళప్పగించి అలా చూడాలనిపిస్తుంది.

మేడం ఫాతిమా కూడా అపురూప సౌందర్యరాశి. బురఖా చాటున ఆమె అందం అసూర్యంపశ్య. అరబ్బు స్త్రీల అందాలు పనిమనుషులకు బాగా తెలుసు.

జుమ్మారోజు దువానియా జరిగేటప్పుడు పనిమనుషులంతా ఒకచోట చేరి ఎవరి సేటాని అందంగా వుందో, ఏ సేటు భార్యను బాగా చూసుకుంటాడో, ఏ సేటు నాలుగు పెళ్ళిళ్ళు చేసుకున్నాడో, ఏ సేటాని బయట చాటుగా బురఖా తీసి తిరుగుతుందో వివరంగా చెప్పుకుని నవ్వుకుంటారు.

అంతేకాదు ఏ ఇంట్లో తిండి సరిగ్గా పెట్టరో, ఎవరింట్లో జీతాలు సరిగ్గా ఇవ్వరో, ఎవరు పనివాళ్ళను బాగా చూసుకుంటారో, ఎవరు కొడతారో కూడా చెప్పుకుంటారు. అందరూ ఒకచోట కూర్చుని కష్టసుఖాలు కలబోసుకుంటారు.

మేడం ఫాతిమా ఎంత అందంగా వున్నా ఏం లాభం? సేటు ఇంటిపట్టున సరిగ్గా వుండడు. రాత్రిపూట కూడా సరిగ్గా ఇంటికి రాడు. ఎప్పుడూ హుక్కా పీలుస్తూ తిరుగుతుంటాడు. ఎప్పుడు వస్తాడో ఎప్పుడు పోతాడో ఎవరికీ తెలియదు. పాపం మేడం ఫాతిమా చూసిచూసి ఏ రాత్రికో గదిలోకి వెళ్ళి పడుకుంటుంది.

ఈ విషయంలో వాళ్ళిద్దరి మధ్యా చాలాసార్లు గొడవ జరిగింది. చాలాసార్లు మేడం ఫాతిమా ఏడ్చింది కూడా. కువైట్ స్త్రీలు కూడా కన్నీటికి మినహాయింపు కానందుకు రజని బాధపడింది.

కానీ పనిమనిషి కావడంతో చనువు తీసుకుని ఓదార్చలేకపోయింది. పనిమనుషులు బానిసల్లా, రోబోల్లా వుంటేనే ఎక్కువకాలం వుండగలరు. పనివారు, డ్రైవర్లు చెవులున్నా చెవిటివారిలా, నోరున్నా మూగవారిలా, కళ్ళున్నా గుడ్డివారిలా మెలగాలి. భావోద్వేగాలను నియంత్రించుకోగలగాలి.

కొందరు సేట్లు ఆడ పనివారి ముందే భార్యలతో శృంగారం చేస్తారు. ముద్దులు కౌగిలింతలు మామూలే. కొందరు పనివారిని ప్రాణంలేని బొమ్మలుగా పరిగణిస్తారు. మేడం ఫాతిమా మంచిదే కానీ ఈ అరబ్బులు ఎప్పుడు ఎలా వుంటారో చెప్పలేం. కోపం వస్తే వారిని పట్టలేము. ఆలోచనల్లోనే కారు గమ్యాన్ని చేరుకుంది.

షాలే అనే ఆ ప్రాంతంలో షేకులు విలాసవంతమైన విడిది గృహాలను నిర్మించుకున్నారు. పక్కనే అరేబియా సముద్రం అలలతో ఎగసిపడుతోంది. అవేవీ పట్టించుకునే స్థితిలో లేదు మేడం ఫాతిమా. కారు దిగుతూనే భవనంలోకి పరుగు తీసింది. అయేషాను ఎత్తుకుని నడుస్తూ ఆమెను అందుకోవడం కష్టమయింది రజనికి. లోపలికి వెళ్ళేసరికి భయానకమైన ఆ దృశ్యాన్ని చూసి కెవ్వున కేక వేసింది రజని.

అక్కడ మేడం ఫాతిమా రక్తపు మడుగులో పడివుంది. పక్కనే సేటు చేతిలో రక్తమోడుతున్న కత్తితో భయంకరంగా కనపడుతున్నాడు. అతడి మరోచేతిని ఒక స్త్రీ గట్టిగా పట్టుకుని నిలబడి వుంది. ఆమె అర్ధనగ్నంగా వుంది.

రక్తాన్ని చూడగానే కళ్ళు తిరిగాయి. కాళ్ళు వణికాయి. పడిపోతానేమో అనుకుని పక్కనే వున్న స్తంభాన్ని ఆసరా చేసుకుంది రజని.

అమ్మను చూసిన అయేషా కిందకి దూకి అమ్మ దగ్గరికి పోవాలని ప్రయత్నిస్తోంది. ఫాతిమా లేవడానికి ప్రయత్నిస్తూ "రజనీ అయేషాను తీసుకుని పారిపో.. ఈ దుర్మార్గుడు నా బిడ్డను కూడా చంపేస్తాడు. నా బిడ్డను నువ్వు బ్రతికించు" అంటూ కేకలు వేస్తోంది.

ఒక్క నిముషం మైండ్ పని చెయ్యలేదు రజనికి. వళ్ళు చచ్చుపడిపోయిన భావన. అయినా వెనుతిరిగి ఇసుకలో పరిగెత్తింది. ఎంత దూరం పోగలదు?

సేటు ఒక్కుదుటున పరిగెత్తుకొచ్చి అయేషాను లాక్కున్నాడు.

"ఇది నా బిడ్డ. నేను పెంచుతాను. నీకు విడాకులిస్తాను పో" అంటూ ఫాతిమా జుట్టు పట్టుకుని బయటికి తోసాడు.

"రేయ్ కుక్కా నన్ను ఇంట్లో వుంచి బయట ఆడవాళ్ళతో కులుకుతావా? నాశనమైపోతావురా" అని అరిచింది ఫాతిమా.

"నేను ముస్లింను. నాలుగు పెళ్ళిళ్ళు చేసుకుంటాను. నువ్వు ఒప్పుకోవాలి అంతే. నిన్ను ప్రాణాలతో వదిలాను సంతోషించు" అంటూ బదులుగా అరిచాడు సేటు.

అది ఇండియా అయినా, గల్ఫ్ అయినా, యూరప్ అయినా స్త్రీల సమస్యలు దాదాపూ ఒకే విధంగా వుంటాయి అనిపించింది రజనికి.

ఎక్కడ పొడిచాడో తెలియదు కానీ మేడం వళ్ళంతా రక్తమే. "నా బిడ్డను నాకివ్వరా" అంటూ పెనుగులాడింది ఫాతిమా.

దూరంగా తోసేశాడు సేటు. ఇంతలో ఎలా తెలిసిందో ఏమో ఫాతిమా తమ్ముళ్ళు అక్కడికి పరిగెత్తుకొచ్చారు.

నాలుగు దెబ్బలు వేసి అయేషాను లాక్కుని ఫాతిమాను కార్లో వేసుకుని కువైట్ సిటీ వైపు కారును ఉరికించారు.

వారం రోజుల తర్వాత ఫాతిమా కోలుకుంది కానీ ఒక చెయ్యి బాగా దెబ్బతింది. కత్తిపోటు నరాలకు తాకడంతో చెయ్యి చచ్చుబడిపోయింది.

సేటుపై మర్డర్ అటెంప్ట్ నేరంపై పోలీస్ కేసు అయ్యింది. సేటును అరెస్ట్ చేసారు. కోలుకోగానే ఫాతిమా విడాకులు కావాలని కోర్టులో కేసు వేసింది. కువైట్ దేశంలో తొందరగానే తీర్పు ఇచ్చేస్తారు. ఇస్లాం మతం స్త్రీలనే సపోర్ట్ చేస్తుంది.

పెళ్ళిలో వరుడు వధువుకు కన్యాశుల్కం ఇచ్చి పెళ్ళి చేసుకోవాలి. అలాగే విడాకులప్పుడు కూడా అతడు తన సంపాదనలో సగభాగం సమర్పించుకుని పిల్లల బాధ్యత తీసుకోవాలి. ఆ స్త్రీ మరలా మరో పెళ్ళి చేసుకునేంత వరకూ అతనే పోషణ భారం వహించాలి. స్త్రీ సున్నితమైనది, బయటికి వెళ్ళి సంపాదించలేదు కాబట్టి, పిల్లలను కనడమనే సృష్టికార్యాన్ని ఆమె మోస్తోంది కాబట్టి ఇది ఇస్లాం చట్టం స్త్రీకి కల్పించిన గౌరవప్రదమైన సౌకర్యం.

స్త్రీని ఫ్రీగా పెళ్ళి చేసుకుని వాడుకుని, పిల్లల్ని కని ఇచ్చాక, మోజు తీరి, తరువాత వద్దని ఫ్రీగా వదిలేయడానికి అరబ్ చట్టం ఒప్పుకోదు. ఆ చట్టం స్త్రీలోలుడైన పురుషుడికి కఠినంగా కొన్ని షరతులను విధించింది.

అందుకే పురుషులు సంపాదించడానికి స్త్రీలు ఎండ కన్నెరుగకుండా ఇంట్లోవుండి పిల్లలను కనడానికి పుట్టారు అనే సంప్రదాయం వీరిది. ప్రస్తుతం అరబ్ స్త్రీలు కూడా బురఖా వదిలి బయటికి వచ్చి ఉద్యోగాలు చేస్తున్నారు. పురుషులతో సమానంగా అన్నిరంగాలలో రాణిస్తున్నారు. ఇది మంచి పరిణామమే. ఈ క్రమంలో. సేటు తన ఆస్తిలో మూడొంతులు మేడం ఫాతిమాకు అయేషాకు సమర్పించుకోవాల్సి వచ్చింది. మరలా నెలనెలా అయేషా పోషణకు మూడొందల దినారాలు ఇవ్వాలని కోర్టు తీర్పు ఇచ్చింది..

మేడం ఫాతిమా దు:ఖానికి అవధులు లేవు. రజనీనే పక్కన వుండి మేడంను ఓదార్చగలిగింది. విడాకుల తర్వాత కొత్త ఇంటికి నివాసాన్ని మార్చింది ఫాతిమా.

కష్టకాలంలో తనకు తోడుగా అండగా నిలబడిన రజనీకి కావల్సిన దినారాలు ఇచ్చింది. ఆ డబ్బుతో ఇద్దరు చెల్లెళ్ళ పెళ్ళి చేసి బాధ్యతలు తీర్చుకుంది రజని.

మరో నాలుగేళ్ళు గడిచాక ఫాతిమా ఒక కువైటీని పెళ్ళి చేసుకుంది. జీవితమంతా ఫాతిమాకు ఒక చెయ్యి పని చెయ్యలేదు. అయేషాను పెంచే బాధ్యత పూర్తిగా రజనీకే అప్పగించింది. తన జీవితకాలమంతా మేడం ఫాతిమా సేవలోనే గడిపింది రజని.

ఏళ్ళు గడిచి వృద్దాప్యం మీదపడి పని చెయ్యలేకపోయినా సరే రజనీని ఇండియాకు పంపలేదు అయేషా. తన వద్దే కువైట్ లోనే వుంచుకుని పోషించింది.

కత్తిపోట్లకు గురయ్యాక ఫాతిమా ఆరోగ్యం నిలకడగా వుండేది కాదు. కొన్నేళ్ళ తర్వాత ఆమె "రజనీ నేను వెళ్ళిపోతున్నాను. నువ్వు అయేషాను జాగ్రత్తగా చూసుకో" అంటూ కన్నుమూసింది.

తల్లి పోయిన బాధతో శోకంలో మునిగిన అయేషాను తల్లిలా ఓదార్చింది రజని.

తరువాత రజనీ కూడా చనిపోయాక ఏ జన్మ బంధమో అనుకుంటూ అక్కడే తన తల్లి పక్కనే సమాధి చేసింది అయేషా.

ఇలా నిస్వార్థంగా పని చేసి జీవితాలను త్యాగం చేసిన సేవకుల సమాధులు లెక్కకు అందనివి ఎన్నో కువైట్ లో వున్నాయి.

సుదూర ప్రాంతాలనుండి దినారాల కోసం వచ్చిన పరదేశులు

జీవితాన్ని ఆ నేలకే అంకితం చేసి, తనువును అక్కడే చాలించి, కట్టెగా మారి ఆ మట్టిలోనే కలిసిపోయినవారు ఎందరో..

(మరోకథ వచ్చేనెల)

Post your comments